E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 03-03-2026 (వారం) మంగళవారం సంపుటి: 02 || సంచిక:60|| పేజీలు–6 www.ekaburu.com

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం



ఈ కబురు, న్యూఢిల్లీ: నేడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ రోజు ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని తెలిపింది. చంద్రగహణాన్ని వీక్షించే అవకాశం తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉంటుందని పేర్కొంది.

....(మిగతా2లో)



2

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

## నెతన్యాహుకు మోదీ ఫోన్

ఈ కబురు : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తోంది. ప్రస్తుత పరిస్థితులపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ప్రధాని నరేంద్రమోదీ ఫోన్‌లో మాట్లాడారు.



2

బాలికపై అత్యాచారం..

## నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

ఈ కుబరు, రంగారెడ్డి : ప్రేమ, పెళ్లి పేరుతో మాయ మాటలు చెప్పి బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడి, ఆమెను తల్లిని చేసిన నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష, రూ.70 వేల జరిమానా విధించింది.

భారత్–కెనడా మధ్య ..

## యురేనియం డీల్

**ఈ కబురు** : భారత్‌కెనడా మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సోమవారం 2.6 బిలియన్ డాలర్ల విలువైన యురేనియం సరఫరా ఒప్పందం మీద రెండుదేశాలు సంతకాలు చేశాయి . అలాగే సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA)పై చర్చలు జరిపేందుకు అంగీకారం కుదిరింది. హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్రమోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ....(మిగతా2 లో)



పశ్చిమాసియా

# అల్లకల్లోలం



### ...కువైట్‌లోని.. అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడి



- ఇరాన్‌పై అతిపెద్ద 'ఆపరేషన్... అసలేమిటీ 'ఎపిక్ ఫ్యూరీ'..?
- ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో ఇరాన్‌పై అమెరికా భారీ సైనిక చర్య
- తొలి 24 గంటల్లోనే ఇరాన్‌లోని 1000కి పైగా కీలక లక్ష్యాలపై దాడులు
- నాటాంజ్ అణుక్షేత్రంపై దాడి జరిగిందన్న ఇరాన్ రాయబారి.. ఖండించిన ఐఏఈఏ
- మెరికాఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ భార్య కూడా మృతి
- శనివారం జరిగిన దాడుల్లో తీవ్ర గాయాలపాలైన మన్సూరేహ్
- కోమాలోకి వెళ్లి సోమవారం ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడి

ఈ కబురు : ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారింది. తమ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ దాడులు చేపట్టింది. దీంతో పరిస్థితులు మరింత దిగజారాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో పొగ దట్టంగా అలముకుంది. అంబులెన్స్‌లు, అగ్నిమాపక యంత్రాలు అక్కడికి చేరుకున్నట్లు పలు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి.

**––దుబాయ్, దోహాల్లో పేలుళ్లు..**

మరోవైపు, ఇరాన్ డ్రోన్ దాడులతో బహ్రెయిన్ రాజధాని మనామాతో పాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి. సైప్రస్‌లోని బ్రిటన్ నౌకాదళ స్థావరంపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో స్వల్ప నష్టమే జరిగిందని సైప్రస్ ప్రభుత్వం వెల్లడించింది. ఇక, ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత మోగుతోంది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అడ్డుకుంటోందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించాయి.

**––అమెరికాతో చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్**

ఈసందర్భంగా యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తోన్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. యుద్ధం విషయంలో అమెరికా (USA)తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టంచేశారు. "ఈ దాడులను మేం మొదలుపెట్టలేదు. ట్రంప్ తన తప్పుడు ఆకాంక్షలతో ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెట్టేశారు. ఇజ్రాయెల్ అధికార కాంక్ష కోసం అమెరికా సైనికులను బలి చేస్తున్నారు" అని అలీ లరిజానీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

**––ఇరాన్‌పై అతిపెద్ద 'ఆపరేషన్... అసలేమిటీ 'ఎపిక్ ఫ్యూరీ'..?**

ఇరాన్‌పై అమెరికా అకస్మాత్తుగా విరుచుకుపడింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన ఈ భారీ సైనిక చర్యలో భాగంగా, కేవలం 24 గంటల వ్యవధిలోనే ఇరాన్‌లోని 1000కి పైగా కీలక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు అమెరికా రక్షణ శాఖ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఇది కేవలం వైమానిక దాడి మాత్రమే కాదని, గగనతలం, సముద్రం, సైబర్, మరియు అంతరిక్ష (స్పేస్) విభాగాలను ఏకకాలంలో వినియోగిస్తూ చేసిన అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్ అని పెంటగాన్ వెల్లడించింది. ఖండాతరాల నుంచి వచ్చిన వేలాది మంది సైనికులు, భారీ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు, అత్యాధునిక బాంబర్లు ఈ దాడిలో పాల్గొన్నాయి.

....(మిగతా2 లో)

## ప్రధాని పదవి చేపట్టేందుకు సిద్ధమే



**..ఎస్.. ఈ దేశం కోసం ప్రధాని అవుతా..**

**..మొదటి సారి ప్రధాన మంత్రి పదవి గురించి సానుకూల సంకేతాలు ఇచ్చిన రాహుల్ గాంధీ**

**ఈ కబురు, వికారాబాద్ :**

తెలంగాణ లో జరిగిన డీసీసీ అధ్యక్షులు శిక్షణ శిబిరంలో ముగింపు సమావేశంలో ప్రధాన మంత్రి పదవి చేపట్టేందుకు సుముఖత వ్యక్తం చేసిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభ్యర్థనపై రాహుల్ గాంధీ సానుకూల స్పందన.. ఈ దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిందేనని కోరిన రేవంత్ రెడ్డి..*అందుకు స్పందించిన రాహుల్ గాంధీ మోడీ పై యుద్ధానికి సిద్ధం అంటూ ప్రధాన మంత్రి పదవి చేపట్టడానికి అంగీకారం తెలిపిన రాహుల్ గాంధీ. డీసీసీ ల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు..ఈ దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాల్సిందే. రాహుల్ జి కుటుంబం లో తాత, నానమ్మ, తండ్రి ప్రధానమంత్రి అయ్యారు కాబట్టి రాహుల్ గాంధీ కి ప్రధాన మంత్రి పదవి వ్యామోహము లేదు. రాహుల్ జి అత్యంత సాధారణ వ్యక్తిలా అందరిలో కలిసిపోతు రాజకీయాలు చేస్తున్నారు. కానీ నేడు దేశం ఉన్న పరిస్థితులలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రిగా అయ్యేలా ప్రతి ఒక్కరు కష్టపడాలి.

....(మిగతా2 లో)

హైడ్రా ఇళ్ల కూల్చివేతపై

## బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం



హైడ్రా పేదల ఇళ్ళను కూల్చుతోందని విమర్శలు

పెద్దల ఇళ్లు హైడ్రాకు కనిపించడం లేదని ఆరోపణ

బాన్సువాడలో హిందూ యువకులను అరెస్టు చేశారన్న బండి సంజయ్

హిందువులు ఇప్పటికైనా ఉద్యమించాలని పిలుపు

ఇంకా ఎన్నాళ్ళు ఈ దాడులు భరిస్తారని ప్రశ్నించిన బండి సంజయ్

....(మిగతా2 లో)

ఫీజుల బకాయిలు..

## స్కాలర్ షిప్ లు వెంటనే చెల్లించాలి



మార్చి 6న రాష్ట్ర వ్యాప్తంగా తరగతులు బహిష్కరణ..కలెక్టరేట్ ముట్టడి

జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపు

....(మిగతా2 లో)

జనాభా దామాషా ప్రకారం

## ఎస్సీ రిజర్వేషన్ లు పెంచాలి



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఈమేరకు తీర్మానం చేయాలి

ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాలి

విద్య, ఉద్యోగాల్లోనే కాదు ఉప కులాలకు రాజకీయ రిజర్వేషన్లు సైతం దక్కాలి

ఎస్సీ రిజర్వేషన్ల పెంపునకు జాగృతి దళిత సంఘాలతో కలిసి ఉద్యమిస్తుంది

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ఎస్సీ ఉప కులాల నేతలతో సమావేశం

**ఈ కబురు, హైదరాబాద్ :**

రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్టు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టం అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.సోమవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉప కులాల నాయకులతో సమావేశం అయ్యారు. పెరిగిన ఎస్సీల జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలి.. ఇందుకోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం తీర్మానం చేయాలని కవిత డిమాండ్ చేశారు

....(మిగతా3లో)

జెడ్పీటీసీ స్థాయి నుంచి

## ముఖ్యమంత్రిని అయ్యా: రేవంత్ రెడ్డి



రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యల పైనే గళమెత్తానన్న ముఖ్యమంత్రి

తన మీద కేసులు పెట్టారని, కోర్టుకు వెళ్లారని గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి

రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యమని వ్యాఖ్య

....(మిగతా2 లో)



రాహుల్‌గాంధీ..

రూ.1000 కోట్ల వసూలుకు

**వచ్చారా..? : కేటీఆర్**

....(3లో)



ఇరాన్ లొంగిపోయేందుకు

**సిద్ధంగా ఉంది: ట్రంప్**

....(3లో)

సమర్ధ పాలనకు

## అన్ని శాఖల్లోనూ ఏఐ వినియోగం



డ్రోన్, సీసీ టీవీ, శాటిలైట్ డేటా సమీకృతం చేసే మెకానిజం

వేసవి దృష్ట్యా ఆర్టీసీ బస్టేషన్లలో తాగు నీటిపై శ్రద్ధ పెట్టండి

ఆర్టీజీఎస్, పబ్లిక్ పర్సెప్షన్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు

**ఈ కబురు, అమరావతి :**

అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించుకోవడం ద్వారా పాలనలో సమర్థత మరింత పెంచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... వివిధ అంశాలపై చర్చించారు. డ్రోన్, సీసీ టీవీ కెమేరాలు, శాటిలైట్ సమాచారాన్ని సమీకృతం చేసి...

....(మిగతా3లో)

ఇబ్బంది కలిగిస్తే ..

## రంగు పడుద్ది

సిటీ సీపీ హెచ్చరిక



**ఈ కబురు, హైదరాబాద్ :**

నగరంలో హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

....(మిగతా3 లో)



శబరిమల అంశంపై..

**అఫిడవిట్ దాఖలు చేయనున్న ట్రావెన్‌కోర్ బోర్డు**

....(3లో)

భారత్–కెనడా మధ్య..

# యురేనియం డీల్



దేశంలో పౌర అణుఇంధన కార్యక్రమానికి నిరంతరాయ సరఫరాను కొనసాగించడమే ఈ డీల్ ఉద్దేశం. చిన్న రియాక్టర్లు, అధునాతన రియాక్టర్లపై కలిసి పనిచేయనున్నామని మోదీ (PM Modi) తెలిపారు అలాగే 2026 చివరి నాటికి సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై కొలిక్కి రావాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నట్లు కార్నీ వెల్లడించారు.

--స్వామి వివేకానంద సూక్తిని గుర్తుచేసుకున్న కెనడా ప్రధాని

1893లో స్వామి వివేకానంద కెనడాలో పర్యటించిన విషయాన్ని మార్క్ కార్నీ గుర్తుచేసుకున్నారు. "లేవండి.. మేల్కొనండి.. లక్ష్యం చేరేవరకు ఆగకండి" అన్న వివేకానంద సూక్తిని ప్రస్తావించారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు కార్నీ భారత్‌లో పర్యటిస్తున్నారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు..

# నెతన్యాహుకు మోదీ ఫోన్



"పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరాం. అలాగే ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించాం" అని తమ సంభాషణ గురించి మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఇదిలాఉంటే.. ఆదివారం రాత్రి భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీకి మోదీ అధ్యక్షత వహించారు. దేశ భద్రత, వ్యూహాత్మక అంశాలపై నిర్ణయం తీసుకునే అత్యున్నత కమిటీ ఇది. పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల తలెత్తిన పరిణామాలపై ఆ సందర్భంగా చర్చించారు.

**--యూఏఈ అధ్యక్షుడికి మోదీ ఫోన్..**

అమెరికాఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) పైకి కూడా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. దాంతో ఆ దేశంలో పలువురు భారతీయులు చిక్కుకుపోయారు. ఈ నేపథ్యంలో యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్ దాడుల్ని ఖండించారు. యూఏఈకి అండగా ఉంటామని సంఘీభావం ప్రకటించారు. అలాగే తమ పౌరులను జాగ్రత్తగా చూసుకుంటున్నందుకు షేక్ మహమ్మద్‌కు కృతజ్ఞత తెలిపారు.

**--సౌదీ.. బహ్రెయిన్ దేశాధినేతలకు ప్రధాని మోదీ ఫోన్**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ గల్ఫ్ దేశాధినేతలకు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా, సౌదీ అరేబియా నేత మహ్మద్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రెండు దేశాలపై దాడులను ఖండించారు. ఇరు దేశాల్లో భారతీయుల క్షేమ సమాచారం గురించి ఆరా తీశారు. ఇజ్రాయెల్, అమెరికా జరిపిన సంయుక్త దాడిలో ఇరాన్ చీఫ్ ఆయతుల్లా ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. దీంతో గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతిదాడులకు పాల్పడుతోంది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడింది. ఇరాన్ డ్రోన్ దాడులతో బహ్రెయిన్ రాజధాని మనామాతో పాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి.

హైడ్రా ఇళ్ల కూల్చివేతపై

# బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం



**ఈ కుబరు, హైదరాబాద్ ;**

హైదరాబాద్ నగరంలో హైడ్రా పేదల ఇళ్ళను కూల్చుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రధాని ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లను నిర్మిస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కూల్చివేత ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. హైడ్రాకు పెద్దవాళ్ల ఇళ్లు కనిపించడం లేదని ఆరోపించారు. కేవలం పేదల ఇళ్లు మాత్రమే కూల్చుతున్నారని అన్నారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ, బఫర్ జోన్‌లో, ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఎన్ని ఇళ్లను కూల్చివేశారో లెక్కలు తీయడానికి సిద్ధమా అని సవాల్ చేశారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలో భూదాన్ పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ సమాజం జాగృతం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. హిందువులు రోడ్ల మీదకు వచ్చి కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల మెడలు వంచాల్సిందేనని అన్నారు. ఇంకా ఎన్ని రోజులు ఇలాంటి దాడులను భరిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం బొట్టు పెట్టుకుని దేవుడిని మొక్కడంతో సరిపోదని అన్నారు. దేవాలయాలపై దాడులు జరిగినప్పుడు స్పందించని వాడు హిందువే కాదని బండి సంజయ్ అన్నారు. ముత్యాలమ్మ గుడి మీద దాడి చేసినా, మరే గుడిపై దాడి చేసినా స్పందించేది బజరంగ్ దళ్, హిందూవాహిని, హిందూ సంస్థలు, బీజేపీ మాత్రమే అన్నారు. కానీ సామాన్య హిందూ సమాజం ఇలాంటి దాడులను ఖండించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాన్సువాడలో అమాయకులైన హిందూ యువకులను అరెస్టు చేసి జైల్లో పెడితే వారి కుటుంబాలు కన్నీళ్లు పెడుతున్నాయని అన్నారు. చాంద్రాయణ గుట్టలో చారిత్రాత్మక హనుమాన్ దేవాలయంపై దాడి జరిగితే కూడా హిందువులు బయటకు రావడం లేదని అన్నారు. ఇదేం పద్ధతి... హిందూ సమాజం ఇలాంటి దాడులను ఇంకా ఎన్నాళ్లు భరిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో అనేక దేవాలయాలపై దాడులు జరిగాయని అన్నారు. తాను ఇతర ప్రార్థనాలయాల గురించి మాట్లాడటం లేదని, కానీ హిందువుగా తమ దేవాలయంపై దాడి జరుగుతుంటే ప్రశ్నిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని హిందూ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారి అర్థం చేసుకోవాలని, దేవాలయాలపై దాడులు జరుగుతుంటే స్పందించాలని బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం అన్ని పార్టీల జెండాలు పక్కన పెట్టి కేవలం కాషాయ జెండాను పట్టుకుని కొట్లాడుదామని పిలుపునిచ్చారు. బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని అన్నారు.

# పశ్చిమాసియా అల్లకల్లోలం

**మెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఖమేనీ భార్య మృతి**



ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఖమేనీ భార్య మన్సూరేహ్ ఖోజస్తే బాగెర్‌జాదే అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడి మరణించారు. శనివారం ఇరాన్‌పై జరిగిన వైమానిక దాడుల్లో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని, ఆ తర్వాత కోమాలోకి వెళ్లి సోమవారం తుది శ్వాస విడిచారని ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఆమె మరణంతో 'షహీద్' (అమరవీరుల) స్థాయికి చేరుకున్నారని ఆ దేశ ప్రసార సంస్థ ప్రెస్ టీవీ పేర్కొంది. ఇదే దాడుల్లో అయతొల్లా ఖమేనీ కూడా మరణించినట్లు ఇరాన్ మీడియా ఇదివరకే ప్రకటించింది. కేవలం ఖమేనీ దంపతులే కాకుండా.. వారి కుమార్తె, మనవరాలు, కోడలు, అల్లుడు కూడా ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇరాన్ అత్యున్నత నాయకుడి కుటుంబం మొత్తం తీవ్ర ప్రభావానికి లోనైంది. 1947లో మష్హద్‌లోని ఓ వ్యాపారి కుటుంబంలో జన్మించిన మన్సూరేహ్, 1964లో ఖమేనీని వివాహం చేసుకున్నారు. వీరికి ఆరుగురు సంతానం కాగా, ఆమె జీవితాంతం బయటి ప్రపంచానికి దూరంగా, అంతర్ముఖంగానే ఉన్నారు. తాజా పరిణామాలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ దాడులకు ప్రతీకారంగా దీర్ఘకాలిక యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధికారులు ప్రకటించడంతో అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.



--ఏళ్ల తరబడి ప్లాన్ చేశాం: జనరల్ డాన్ కేన్

పెంటగాన్‌లో సెక్రటరీ ఆఫ్ వార్ పీట్ హెగ్సెత్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్, ఎయిర్ ఫోర్స్ జనరల్ డాన్ కేన్ ఈ ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. ఈ దాడి ఆకస్మికంగా జరిగింది కాదని, దీని వెనుక నెలల తరబడి, కొన్ని సందర్భాల్లో ఏళ్ల తరబడి సాగిన పకడ్బందీ ప్రణాళిక ఉందని ఆయన స్పష్టం చేశారు. నిర్దిష్ట లక్ష్యాలను ఎంచుకుని, వాటిని ఎలా ఛేదించాలనే దానిపై సుదీర్ఘ కసరత్తు జరిగిందని ఆయన తెలిపారు. ప్రెసిడెంట్ నుంచి అనుమతి రాగానే, ఫిబ్రవరి 28న ఈస్టర్న్ స్టాండర్డ్ టైం ప్రకారం రాత్రి 01:15 గంటలకు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ ఆపరేషన్‌ను ప్రారంభించింది.

**--నాలుగు వైపుల నుంచి ఏకధాటిగా..**

భూమి, సముద్రం, ఆకాశం నుంచే కాకుండా అంతరిక్షం నుంచి కూడా ఇరాన్‌పై ఒత్తిడి పెంచినట్లు జనరల్ కేన్ వివరించారు. దాడి ప్రారంభమైన మొదటి దశలోనే వందలాది విమానాలు, యుద్ధ నౌకలు, డ్రోన్లు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ విమానాలు ఒకేసారి విరుచుకుపడ్డాయని, దీన్ని ఒక సింగిల్, సింక్రనైజ్డ్ వేవ్ (ఏకీకృత దాడి)గా ఆయన అభివర్ణించారు. దాడికి ముందు గత 30 రోజులుగా ఆ ప్రాంతంలో అమెరికా తన బలగాలను వ్యూహాత్మకంగా మోహరిస్తూ వచ్చిందని, ఇందులో భాగంగా లింకన్ మరియు ఫోర్డ్ క్యారియర్ స్ట్రైక్ గ్రూపులను సిద్ధం చేసినట్లు తెలిపారు. విస్కాన్సిన్ ఆర్మీ నేషనల్ గార్డ్, వెర్మాంట్ ఎయిర్ నేషనల్ గార్డ్ వంటి దళాలను కువైట్, ఇరాక్ మరియు అట్లాంటిక్ ప్రాంతాల నుంచి తరలించి ఈ మిషన్‌లో భాగం చేసినట్లు పేర్కొన్నారు.

**--ముందు కళ్లుగప్పి.. ఆపై దెబ్బకొట్టారు**

ఈ ఆపరేషన్‌లో అత్యంత కీలకమైన అంశం సైబర్ మరియు స్పేస్ వార్‌ఫేర్. జనరల్ కేన్ తెలిపిన వివరాల ప్రకారం, బాంబు దాడులు మొదలవడానికి ముందే యూఎస్ సైబర్ కామ్ మరియు యూఎస్ స్పేస్ కామ్ ఇరాన్ కమ్యూనికేషన్ వ్యవస్థలపై దాడి చేశాయి. ఇరాన్ రాడార్లను, సమాచార వ్యవస్థలను స్తంభింపజేసి, వారిని "గుడ్డివారిని" చేశాకే అసలు దాడులు మొదలయ్యాయి. దీనివల్ల ఇరాన్ ప్రతిస్పందించే సామర్థ్యం పూర్తిగా దెబ్బతింది. అమెరికా ప్రధాన భూభాగం నుంచి బయలుదేరిన బీ2 బాంబర్లు ఏకంగా 37 గంటల పాటు ప్రయాణించి, ఇరాన్‌లోని భూగర్భంలో ఉన్న బంకర్లపై అత్యాధునిక పెనెట్రేటింగ్ బాంబులను జారవిడిచాయి. దాదాపు 57 గంటల పాటు సాగిన ఈ దాడుల్లో పదివేల కొద్దీ ఆయుధాలను, బాంబులను ప్రయోగించినట్లు అధికారులు తెలిపారు.

**--ఇరాన్ క్షిపణులను అడ్డుకున్న రక్షణ వ్యవస్థ**

అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ వందలాది బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని, అయితే వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నామని జనరల్ కేన్ తెలిపారు. అమెరికాకు చెందిన పేట్రియాట్, థాడ్ క్షిపణి నిరోధక వ్యవస్థలతో పాటు, నేవీ డిస్ట్రాయర్లు ఇరాన్ క్షిపణులను గాలిలోనే కూల్చివేశాయి. ముఖ్యంగా ఖతార్, యూఏఈ, కువైట్, జోర్డాన్, సౌదీ అరేబియాలో ఉన్న మిత్రదేశాల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూడా ఈ ఆపరేషన్‌లో అమెరికాకు సహకరించాయని, ఏళ్ల తరబడి సాగిన ఉమ్మడి శిక్షణ వల్లే ఇది సాధ్యమైందని ఆయన ప్రశంసించారు. "ఈ ఆపరేషన్ ఇంకా ముగిసిపోలేదు, ఇది కేవలం ఆరంభం మాత్రమే. మా పని ఇంకా కొనసాగుతుంది" అని జనరల్ కేన్ హెచ్చరించారు. ఇటీవలి కాలంలో మధ్యప్రాచ్యంలో జరిగిన అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ మిలటరీ ఆపరేషన్‌గా 'ఎపిక్ ఫ్యూరీ' నిలిచిపోతుందని రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు.

నాటాంజ్ అణుక్షేత్రంపై దాడి జరిగిందన్న ఇరాన్ రాయబారి.. ఖండించిన ఐఏఈఏ ఇజ్రాయెల్, అమెరికా నాటాంజ్‌లోని తమ ప్రధాన అణుక్షేత్రంపై దాడి చేశాయని ఐక్యరాజ్యసమితి అణు నిఘా సంస్థ అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)లో ఇరాన్ రాయబారి రెజా నజాఫీ ఆరోపించారు. ఈ దాడి చట్టవిరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పూర్తిగా నేరపూరిత, అనాగరిక చర్య అన్నారు. ఇరాన్ శాంతియుత సురక్షిత అణు సౌకర్యాలపై ఆదివారం మరోసారి దాడి జరిగిందని పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయాలనుకోవడం పూర్తిగా అబద్ధమని చెప్పారు. అయితే ఇరాన్ రాయబారి ఆరోపణలను ఐఏఈఏ ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్‌లోని ఏ అణు కేంద్రాలు దెబ్బతినలేదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) తెలిపింది. వైమానిక దాడుల్లో ఇరాన్‌లోని అణు కేంద్రాలు దెబ్బతిన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని ఐఏఈఏ అధిపతి తెలిపారు. ఈ విషయమై ఇరాన్ న్యూక్లియర్ రెగ్యులేటరీ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. వారి నుంచి ఎలాంటి సంకేతాలు రాలేదని, అలాగే ఇరాన్ సరిహద్దు దేశాల్లో రేడియేషన్ స్థాయిలు పెరిగిన సంకేతాలు కూడా లేవని వెల్లడించారు. మరోవైపు, ఇరాన్‌పై సైనిక చర్యను అమెరికాఇజ్రాయెల్ సమర్థించుకుంటున్నాయి. ఇరాన్ అణుసామర్థ్యాన్ని అడ్డుకోవడమే తమ ప్రధాన ఉద్దేశమని చెబుతున్నాయి. సొంతంగా అణ్వాయుధాల తయారీలో ఇరాన్ తుది దశలో ఉందని అమెరికా, ఇజ్రాయెల్ ఆరోపించాయి.

# ఫీజుల బకాయిలు.. స్కాలర్ షిప్ లు వెంటనే చెల్లించాలి



ఈ కబురు, హైదరాబాద్ ;

రాష్ట్రంలోని 16 లక్షల మంది బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజులు స్కాలర్ షిప్ ల బకాయిలు చెల్లించాలని ఈనెల 6న రాష్ట్రవ్యాప్తంగా తరగతిలో బహిష్కరించి కలెక్టరేట్లో, ఆర్డీవో, ఎంఆర్ఓ ఆఫీస్ ల వద్ద ప్రదర్శనలు చేయాలని జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు.సోమవారం బషీర్ బాఘ్ ప్రెస్ క్లబ్ లో 18 బీసీ సంఘాల సమావేశం బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ళ సతీష్, అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. ee సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంతవరకు 8వేల కోట్లుకు వెయ్యి కోట్లు కూడా ఇవ్వలేదు. అన్ని స్కీములకు కాంట్రాక్టుకు వేల కోట్లు ఇస్తూ చదువుకునే విద్యార్థులకు మాత్రం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 50 ఏళ్లు చరిత్రలో స్కాలర్షిప్ చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత దారుణంగా ఇవ్వకుండా అన్యాయం చేయలేదు. ఇది ప్రభుత్వం ఫెయిల్ ర్ అయినట్లు ప్రజలు భావిస్తున్నారని అన్నారు.ఈ ఫీజ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అష్ట కష్టాల పాలవుతున్నారు. ఇది పరిక్షల సీజన్ హాల్ టికెట్లు ఇవ్వకుండా ఫీజులు కట్టాలని కాలేజీ విద్యార్థులపై యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నారు కోర్సు పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. హాల్ టికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు వచ్చినవారికి అప్పులు చేసి ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. సర్టిఫికెట్లు తెసుకోలేక కొందరు ఉద్యోగాలు కోల్పోతున్నారు. పీజీ కోర్సుల లో సీట్లు పొందిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉద్యోగాలు పొందిన వారు ఇతర దేశాలలో ఉద్యోగాలు వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీనితో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. విదేశాలకు చదువుకోవడానికి సీట్లు వచ్చిన వారికి కూడా సర్టిఫికెట్లు లేక వెళ్లలేకపోతున్నారు. ముఖ్యమైన స్కాలర్ షిప్ , ఫీజు బకాయిలు, స్కీమును ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో పగిళ్ళ సతీష్, నీల వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, మోడీ రాందేవ్, కిషోర్ యాదవ్, నిఖిల్ పటేల్, లవాకుమార్, అంజి గౌడ్, నరేష్ గౌడ్, మేకల శ్రీనివాస్ యాదవ్ రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పదవి చేపట్టేందుకు సిద్ధమే



నేను సీఎం గా అడగడం లేదు ఒక కాంగ్రెస్ కార్యకర్తగా కోరుకుంటున్న.. రాహుల్ గాంధీ ప్రధాని పదవి కోసం కృషి చేయాలి, దేశం కోసం ఆ బాధ్యత తీసుకోవాలి. రాహుల్ గాంధీ కి ప్రధానమంత్రి పదవి అలంకరణ కాదు ఈ దేశ ప్రజలకు సేవ చేయడం కోసమే.. ఆ దిశగా రాహుల్ గాంధీ సంసిద్ధత వ్యక్తం చేయాలి.. ఇది దేశ ప్రజల, కాంగ్రెస్ కార్యకర్తల బలమైన కోరిక..సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని విన్న రాహుల్ గాంధీ నవ్వుతూ అందుకు సన్నద్ధం అన్నట్టుగా తల ఊపారు...ఈ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు పాల్గొన్నారు.



## బాలికపై అత్యాచారం..

### నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బాలాపూర్ మండలానికి చెందిన షేక్ ముజీద్ ఆటో డ్రైవర్. 2022లో పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో నివసించే 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి.. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక గర్భం దాల్చడంతో వివాహం చేసుకోవాలని పట్టుబట్టింది. తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. 2024 ఫిబ్రవరిలో బాలిక మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత కూడా నిందితుడు పెళ్లికి అంగీకరించకపోవడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.15 లక్షల పరిహారం మంజూరు చేసింది.

జెడ్పీటీసీ స్థాయి నుంచి

## ముఖ్యమంత్రిని అయ్యా: రేవంత్ రెడ్డి

ఈ కబురు ; తాను 19 ఏళ్లలో జెడ్పీటీసీ స్థాయి నుంచి ముఖ్యమంత్రిని అయ్యానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ఏపీసీసీ చీఫ్ షర్మిల తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తాను రాజకీయాల్లో ఎప్పుడూ ప్రజా సమస్యలపై గళమెత్తానని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ పైరవీలు చేయలేదని తెలిపారు. తన మీద అనేక కేసులు పెట్టారని, కోర్టుకు కూడా వెళ్లానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యం కూడా అదేనని అన్నారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని, రాహుల్ గాంధీ అనేక సమస్యలపై పోరాటం చేశారని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్,కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నేడు సంపూర్ణ

## చంద్రగ్రహణం



**దేశవ్యాప్తంగా గ్రహణం మధ్యాహ్నం 3.20 గంటలకే ప్రారంభమైనప్పటికీ, తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల తర్వాతే ప్రభావం కనిపిస్తుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉంటుందని తెలిపింది. మళ్లీ ఇలాంటి చంద్ర గ్రహణం 2028, జూలై 6న ఏర్పడుతుందని వెల్లడించింది. రాష్ట్రంలోని వివిధ నగరాల్లో గ్రహణ సమయం**

**--వివరాలు ఇలా..**

**విజయవాడ నగరంలో సాయంత్రం 6.14 గంటలకు చంద్రోదయం కానుంది. గ్రహణం సాయంత్రం 6.48 గంటలకు విడుస్తుంది. సుమారు 34నిమిషాలు గ్రహణ ఛాయలు కనిపించనున్నాయి.**

**రాజమహేంద్రవరంలో 6.07గంటలకు చంద్రోదయం అవుతుంది. 6.48గంటలకు గ్రహణం ముగుస్తుంది. సుమారు 41 నిమిషాల పాటు గ్రహణం కనిపిస్తుంది.**

**నెల్లూరులో సాయంత్రం 6.18 గంటలకు చంద్రోదయం జరుగుతుంది. గ్రహణం ముగిసే సమయం 6.48 గంటలు. నెల్లూరు వాసులు సరిగ్గా 30 నిమిషాల పాటు ఈ ఖగోళ వింతను చూడవచ్చు.**

# ఏఐ, డీప్ ఫేక్ తో ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేశారని మహిళ పిర్యాదు

**రాయదుర్గం పోలీసు స్టేషన్ లో కేసు నమోదు**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), డీపేఫేక్ టెక్నాలజీతో తన ఫోటోలను ఉపయోగించి మార్ఫింగ్ ఫోటోలు, వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేశారని ఓ మహిళ ఇచ్చిన పిర్యాదుతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని రాయదుర్గం పోలీస్ స్టేషన్లో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

రాయదుర్గం వెస్ట్రన్ ప్లాజా అపార్టుమెంటులో నివాసం ఉండే తాడేపల్లి ఇందులేఖ(52) అనే మహిళ తన ఫోటోలు, వీడియోలను మార్ఫింగ్ చేస్తున్నారంటూ రాయదుర్గం పోలీసులకు పిర్యాదు చేసింది. ఏఐ. డిప్ ఫేక్ టెక్నాలజీలో తన ఫోటోలు, వీడియోలను అసభ్యకర రీతిలో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నారని పిర్యాదులో తెలిపింది. మనదేశం లోని వివిధ ప్రాంతాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా వంటి విదేశాల నుంచి సైతం ఈ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని, వీటిని కొన్ని సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ లు, యూట్యూబ్ ఛానళ్లు ప్రసారం చేస్తున్నాయని పిర్యాదుతో పేర్కొంది. ఈ డీప్ ఫేక్ వీడియోల కారణంగా తన ప్రతిష్టకు భంగం కలుగడంతో పాటు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నానని బాధితురాలు పిర్యాదు చేయడంతో రాయదుర్గం పోలీసులు బిఎన్ఎస్ సెక్షన్ 319,335,353తో పాటు ఐటీ సెక్షన్ 66సీ, 660, 67ల కింద కేసు నమోదు చేసుకున్నారు. కాగా దేశాభిమాని, ఏ ట్రూ ఇండియన్, ది న్యూస్ తెలుగు, రెడ్ టీవి తెలుగు, కిషోర్ ట్యాక్స్ వంటి యూట్యూబ్ ఛానళ్లతో పాటు టీమ్ ప్రశ్న, లాఫింగ్ గీ వంటి ఇన్ స్టా ఖాతాలు, పలు ఫేస్బుక్ పేజ్ లలో ఈ వీడియోలను వైరల్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈమేరకు రాయదుర్గం డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ భూపతి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు.

# సిద్ధిక్ నగర్ సంతను ఒకే రోజుకు పరిమితం చేయాలి
## ఆంజనేయులు సాగర్



సిఎంసి కమిషనర్ తో సిద్దిక్ నగర్ సంత సమస్యపై చర్చిస్తున్న ఆంజనేయులు సాగర్



వినతి పత్రంతో సిఎంసి కార్యాలయంలో అంజయ్య నగర్ డివిజన్ నాయకులు

**సంత ఇబ్బందులపై సీఎంసీ కమిషనర్ ను కలిసి వినతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్ కాలనీలో ప్రతి శుక్రవారం, ఆదివారం రెండు రోజులు సంత నిర్వహించడంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని, వారంలో ఒకేరోజు సంత కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ అధికారులను కోరారు. ఈ మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సిఎంసి కమిషనర్ ను కలిసి విన్నవించారు.

ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్ ప్రాంతం ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉండటం వల్ల నిత్యం భారీ వాహన రాకపోకలు జరుగుతుంటాయని, ఇటువంటి రద్దీ ప్రాంతంలో వరుసగా రెండు రోజులు సంత నిర్వహించడం కారణంగా ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఫైర్ సర్వీస్ వంటి వాహనాలు కూడా సకాలంలో వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని, దీనివల్ల ప్రజల భద్రతకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని, సంతను వారంలో ఒకే రోజు మాత్రమే నిర్వహించేలా తక్షణ చర్యలు తీసుకుని ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. కమిషనర్ ను కలిసిన వారిలో సిద్ధిక్ నగర్ జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, సంతోష్ రాము, శ్రీను, దిలీప్, గురు, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అంజయ్య నగర్ స్మశాన వాటికపై...**

అంజయ్య నగర్ స్మశాన వాటిక ఇబ్బందులపై గతవారం ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన సిఎంసి అధికారులకు ఆంజనేయులు సాగర్ కృతజ్ఞతలు తెలిపారు. స్మశాన వాటికలో అభివృద్ధి పనుల కోసం ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరిశీలన చేపట్టారని అన్నారు. కానీ డ్రైనేజీ నీరు స్మశాన వాటికలో నిలుస్తున్న కారణంగా పైప్ లైన్ నిర్మాణం చేపట్టిన తర్వాత అభివృద్ధి పనులు చేపడతామని అధికారులు తెలిపారని, అన్నారు.

ఈ విషయమై సిఎంసి కమిషనర్ చొరవ తీసుకొని వెంటనే డ్రైనేజీ నీరు స్మశాన వాటికలోకి చేరకుండా పైప్ లైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

## జనాభా దామాషా ప్రకారం
# ఎస్సీ రిజర్వేషన్ లు పెంచాలి



ఎస్సీ వర్గీకరణ అమలు చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చేపట్టే జనగణన పూర్తి అయి అధికారికంగా లెక్కలు ప్రకటించిన తర్వాత ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించిందని గుర్తు చేశారు దానికి అనుగుణంగా రిజర్వేషన్ ల పెంపునకు అసెంబ్లీ లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు ఎస్సీ ఉప కులాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ రిజర్వేషన్లు దక్కాల్సిన అవసరం ఉందన్నారుఎస్సీ ఉప కులాలతో కలిసి రిజర్వేషన్ల పెంపు సహా వారి సమస్యల పరిష్కారం కోసం జాగృతి ఉద్యమిస్తుందని తెలిపారు. ఎస్సీ ఉప కులాల్లో కొన్ని కులాలకు క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో 20 ఎస్సీ ఉప కులాల ప్రతినిధులు పాల్గొన్నారు

# ఇబ్బంది కలిగిస్తే ..రంగు పడుద్ది



బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ నుంచి సోమవారం ఆయన పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పండుగ పూట ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బ్లూ కోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ కాయాలన్నారు.

ఇష్టం లేని వారిపై బలవంతంగా రంగులు పూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో, పాదచారులు, వాహనాలపై రంగులు చల్లొద్దని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిల ఆటకట్టించేందుకు నగరవ్యాప్తంగా మఫ్టీలో షీ టీమ్స్ నిఘా ఉంటుందన్నారు. ప్రజలు రసాయన రంగులకు బదులు సహజసిద్ధమైనవి వాడాలన్నారు. వేడుకల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని చెప్పారు. రోడ్లపై యువకులు గుంపులుగా తిరుగుతూ న్యూసెన్స్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రస్తుతం రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లింల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. పీస్ కమిటీల సమన్వయంతో పోలీసులు పనిచేయాలని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. హోలీ సందర్భంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం(3.3.2026) ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్ అండ్ రెస్టారెంట్లపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు. హోలీ పండుగ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చెస్తామని స్పష్టం చేశారు. నగరంలో ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య తలెత్తితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసులకు సహకరించి పండుగను సంతోషంగా జరుపుకోవాలని నగర ప్రజలను కోరారు. ఈ సమావేశంలో అదనపు సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీలు శ్వేత, ఎస్ఎం విజయ్ కుమార్, ఐపీఎస్, డీసీపీలు ఖారే కిరణ్ ప్రభాకర్, రూపేశ్, వెంకట లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# శబరిమల అంశంపై.. అఫిడవిట్ దాఖలు చేయనున్న ట్రావెన్‌కోర్ బోర్డు

ఈ కబురు : కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ తీర్పును తిరిగి సమీక్షించాలని పలు రివ్యూపిటిషన్లు దాఖలయ్యాయి. అయితే ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డ్ (టీడీబీ) మాత్రం మొదటి నుంచీ మహిళల ప్రవేశాన్ని (10 నుంచి 50 ఏళ్ల మధ్య ఉన్న మహిళలు) వ్యతిరేకిస్తూ వస్తోంది. పాత సంప్రదాయాన్నే కొనసాగించాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేస్తామని టీడీబీ(TDB) అధ్యక్షుడు కె. జయకుమార్ వెల్లడించారు. దీనిపై ఆయన విలేకరులతో మాట్లాడారు. "శబరిమల ఆలయ సంప్రదాయాలు, పరిరక్షణ కోసమే ట్రావెన్‌కోర్ బోర్డు ఏర్పాటైంది. మహిళల ప్రవేశం విషయంలో ఉన్న సంప్రదాయాన్ని కొనసాగించాలని బోర్డు సమావేశంలో నిర్ణయించాం. ఇందులో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. ఆలయ సంరక్షణే టీడీబీ లక్ష్యం. అందుకే అఫిడవిట్‌ను దాఖలు చేయాలని టీడీబీ నిర్ణయించింది" అని కె.జయకుమార్ తెలిపారు. మార్చి 14లోగా అఫిడవిట్ దాఖలు చేస్తామన్నారు. సుప్రీంకోర్టు 2018లో శబరిమలకు అన్ని వయసుల మహిళల ప్రవేశానికి అనుమతినిచ్చింది. అప్పటి నుంచి ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతం ఇవన్నీ సుప్రీం కోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సహా ఆయా వ్యాజ్యదారులు మార్చి 14లోగా తమ అభిప్రాయాలు తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# సమర్ధ పాలనకు అన్ని శాఖల్లోనూ ఏఐ వినియోగం



వినియోగించుకునేలా ఒక మెకానిజం తీసుకురావాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు, పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై తమిళనాడులోని శివకాశీకి వెళ్లి అధ్యయనం చేయాలని సీఎం స్పష్టం చేశారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్ స్టేషన్లలో తాగునీటికి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా జరిగేలా పరిస్థితులు ఉండాలన్నారు. అటు పెన్షన్ల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అట్టడుగు స్థానంలో ఉన్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే, ప్రభుత్వం దగ్గరున్న సమాచారం కాకుండా, అదనపు సమాచారం కోసం మాత్రమే ఇకపై సర్వేలు జరపాలి తప్ప, పదేపదే ఒకేరకమైన సమాచారం కోసం ప్రజలను, ప్రభుత్వ సిబ్బందిని ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. మరోవైపు రాష్ట్రంలో వాట్సప్ మన మిత్ర సేవలను మరింత విస్తృతం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాట్సప్ సేవల సంఖ్యను 953కి పెంచినట్టు తెలిపారు. అయితే వీటన్నింటినీ సులభంగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం చెప్పారు.

# ఇరాన్ లొంగిపోయేందుకు సిద్ధంగా ఉంది: ట్రంప్



ఈ కబురు, వాషింగ్టన్: ఇరాన్ నాయకత్వం లొంగిపోయేందుకు సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో.. ఇరాన్ సైనిక ఉన్నతాధికారులు చాలావరకు మరణించారని చెప్పారు. "ఇరాన్‌లోని వందలాది లక్ష్యాలపై దాడులు చేశాం. ప్రపంచం కనీవినీ ఎరుగని రీతిలో విరుచుకుపడ్డాం. ఐఆర్‌జీసీ స్థావరాలు, గగనతల రక్షణ వ్యవస్థలు, 9 నౌకలను ధ్వంసం చేశాం. ఖమేని మృతితో ఇరాన్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు'' అని ట్రంప్ పేర్కొన్నారు.

--ప్రపంచానికి ఉన్న ముప్పును అమెరికాతో కలిసి తొలగించాం: నెతన్యాహు

ప్రపంచానికి ఉన్న ముప్పును అమెరికాతో కలిసి తొలగించామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. ఇరాన్ నిరంకుశ పాలకులు పౌరులను లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు. "పౌరులను రక్షించేందుకే మేం నిరంకుశ పాలకులను లక్ష్యంగా చేసుకున్నాం. ఇరాన్ మమ్మల్ని, అమెరికాను బెదిరిస్తోందని గతంలోనే చెప్పా. యూరప్‌ను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటుందని చెప్పా. ఆ దేశం వద్ద అణ్వాయుధాలుంటే మొత్తం మానవాళినే బెదిరిస్తుంది. ఇజ్రాయెల్‌ను రక్షించుకునేందుకే దాడి చేశాం. ప్రపంచాన్ని కాపాడే ప్రయత్నంలో మాతో కలిసిన ట్రంప్‌నకు ధన్యవాదాలు'' అని నెతన్యాహు పేర్కొన్నారు.

# రాహుల్‌గాంధీ..
## రూ.1000 కోట్ల వసూలుకు వచ్చారా..? : కేటీఆర్

**ఈ కబురు, హైదరాబాద్ :**



లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్టు చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ పోస్టు ప్రాధాన్యం సంతరించుకుంది. ఎక్స్‌లో కేటీఆర్ ఏమన్నారంటే.. 'హలో రాహుల్‌గాంధీ.. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (AICC) ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం' అంటూ వెల్‌కమ్ చెప్పారు. 'మీరిప్పుడు సీఎం దగ్గర రూ.1000 కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా..?' అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. 'పనిలోపనిగా మీరు 100 రోజుల్లో అమలుచేస్తామని చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 ఇతర వాగ్ధానాల పురోగతిని సమీక్షించడంపై కూడా కొంచెం శ్రద్ధ పెట్టండి' అని సూచించారు.

# పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో పడగొడతాం
## ..కాంగ్రెస్ సర్కార్‌కు బండి సంజయ్ వార్నింగ్

**గాంధీ విగ్రహం పేరుతో పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారన్న బండి సంజయ్**
**తాము అధికారంలోకి వచ్చాక పెద్దల ఇళ్లను కూల్చివేస్తామని హెచ్చరిక**
**మూటల కోసమే రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చారని విమర్శ**

**ఈ కబురు, హైదరాబాద్ :**



మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం పేదల ఇళ్లను కూల్చివేయడంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బఫర్ జోన్, ఎఫ్టీఎల్ సాకుతో సామాన్యుల ఇళ్లను కూలిస్తే, తాము అధికారంలోకి వచ్చాక పెద్దల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తామని హెచ్చరించారు. గాంధీ విగ్రహం ఏర్పాటు చేసే సాకుతో వందలాది కుటుంబాలను రోడ్డున పడేయడం గాంధీ సిద్ధాంతాలకే విరుద్ధమని మండిపడ్డారు. గతంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన కాలేజీల కూల్చివేత విషయంలో విద్యార్థుల పరీక్షలను సాకుగా చూపిన ప్రభుత్వం... ఇప్పుడు ఖమ్మంలో కూల్చివేతలు చేస్తున్నప్పుడు ఇంటర్ విద్యార్థుల పరీక్షలు, భవిష్యత్తు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఒవైసీని ప్రసన్నం చేసుకోవడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని బండి సంజయ్ ఆరోపించారు. హిందువులను జైల్లో వేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని, దీనికి ప్రజలంతా ఏకమై బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేతలు తలుచుకుంటే కాంగ్రెస్ నాయకులు బయట తిరగలేరని, ఇప్పటికే ఆ పార్టీలో అంతర్యుద్ధం మొదలైందని ఎద్దేవా చేశారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ... ఆయన కేవలం 'మూటల' కోసమే రాష్ట్రానికి వచ్చారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలన గాలికి వదిలేసి, ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తూ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పేదల పక్షాన బీజేపీ పోరాటం ఆగదని, అవసరమైతే బుల్డోజర్లతోనే సమాధానం చెబుతామని బండి సంజయ్ అన్నారు.

## టాటా ఏఐజీ కొత్త ఇన్సూరెన్స్ ప్లాన్




ముంబై: టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ 'యాక్సిడెంట్ సూపర్ గార్డ్ ప్లస్' ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ప్రమాదాల్లో సమగ్ర ఆర్థిక రక్షణను అందించే వ్యక్తిగత ప్రమాద బీమా ప్లాన్ ఇదని, దేశంలో ఏటా ప్రమాదాల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో దీన్ని తీసుకొచ్చినట్టు ప్రకటించింది. వ్యక్తుల ఆదాయం, అప్పులు, జీవనశైలి రిస్క్‌లకు అనుగుణంగా కవరేజీని ఎంపిక చేసుకోవచ్చు.

ప్రమాద మరణం, శాశ్వత పాక్షిక, పూర్తి వైకల్యంలో ఏక మొత్తంలో బీమా పరిహారం లభిస్తుంది. ప్రమాదాల కారణంగా అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రిలో చేరాల్సి వస్తే అయ్యే ఖర్చులకు రీయింబర్స్‌మెంట్ పొందొచ్చు. లోన్ షీల్డ్ (రుణాల కోసం), ఈఎంఐ ప్రొటెక్షన్, పెట్‌కేర్ పేరుతో ఐచ్ఛిక కవరేజీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఐదేళ్ల కాల వ్యవధిపై వ్యక్తులు, కుటుంబ సభ్యులు ఈ ప్లాన్‌ను తీసుకోవచ్చు. వేతన జీవులకు ప్రీమియంలో అదనపు డిస్కౌంట్ లభిస్తుంది.




## ఈపీఎఫ్ వడ్డీ రేటు..
# ఈసారీ 8.25 శాతమే

ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్)పై ఇచ్చే వడ్డీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (202526) 8.25 శాతంగా కొనసాగించాలని ఈపీఎఫ్ఓ నిర్ణయించింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ నేతృత్వంలో జరిగిన 239వ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీల (CBT) సమావేశంలో సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ ఇంతే వడ్డీరేటు అందించగా.. ఈసారి కూడా ఎలాంటి మార్పులు చేయకపోవడం గమనార్హం. "202526 ఆర్థిక సంవత్సరానికి గాను భవిష్య నిధి చందాదారుల నిధిపై 8.25% వడ్డీ రేటు జమ చేయాలని సోమవారం జరిగిన సమావేశంలో సీబీటీ నిర్ణయించింది" అని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. వడ్డీ రేటుకు సంబంధించి సీబీటీ ప్రతిపాదనను కేంద్ర ఆర్థికశాఖకు పంపనున్నారు. ప్రభుత్వం అధికారికంగా వడ్డీరేటును నోటిఫై చేశాక, ఈపీఎఫ్ చందాదారు ఖాతాలకు వడ్డీ మొత్తం జమవుతుంది.

ప్రస్తుతం ఈపీఎఫ్ఓలో 7 కోట్ల మందికిపైగా చందాదారులున్నారు. 202223 ఆర్థిక సంవత్సరంలో భవిష్య నిధిపై వడ్డీ రేటు 8.15 శాతం కాగా, 202324లో 8.25 శాతానికి పెంచారు. అప్పటి నుంచి అదే వడ్డీరేటును కొనసాగిస్తున్నారు. నిస్తేజంగా ఉన్న ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లకు సంబంధించి కూడా సీబీటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. తొలి దశలో రూ.వెయ్యి కంటే తక్కువ మొత్తాలు కలిగిన 1.33 లక్షల ఖాతాలను గుర్తించారు. మొత్తం రూ.5.68 కోట్లను సెటిల్ చేయనున్నారు.

## రాకెట్‌లా దూసుకెళ్లిన
# బంగారం, వెండి ధరలు



బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. అమెరికా, ఇజ్రాయెల్ చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మరణించడం, ఇరాన్ కూడా అమెరికా ఆస్తులే లక్ష్యంగా ప్రతిదాడులు చేపడుతుండడంతో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు వేగంగా స్పందించే స్వభావం కలిగిన బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ వీటి ధరలకు రెక్కలొచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర భారీగా పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్సు (దాదాపు 31 గ్రాములు) ధర 5,410 డాలర్లు వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు సుమారు 96 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.45గా ఉంది. దీన్ని అనుసరించి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మధ్యాహ్నం 1 గంట సమయంలో 10 గ్రాముల మేలిమి పసిడి (24 క్యారెట్లు) రూ.1.73 లక్షలు (పన్నులు కలుపుకొని) పలుకుతోంది. వెండి కిలో ధర మళ్లీ రూ.3 లక్షల మార్కు దాటింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ (MCX) వీటి ధరలు భారీగా పెరిగాయి. ఏప్రిల్ కాంట్రాక్ట్ 10 గ్రాముల బంగారం ధర ఒక్క రోజులోనే దాదాపు ఐదు శాతం పెరిగి రూ.1.69 లక్షలకు చేరింది. అంటే ఒక్క రోజులోనే రూ.6 వేలు పైనే పెరిగింది. మే నెల కాంట్రాక్ట్ కిలో వెండి ధర కూడా రూ.15 వేలకు పైనే పెరిగి రూ.2.97 లక్షల వద్ద ట్రేడవుతోంది. యుద్ధ సమయాల్లో స్టాక్ మార్కెట్లు, కరెన్సీలు అస్థిరతకు లోనవుతాయి. దీంతో పెట్టుబడిదారులు తమ డబ్బును నష్టపోకుండా కాపాడుకోవడానికి బంగారం, వెండిని సురక్షితమైన మార్గాలుగా భావిస్తారు. యుద్ధం వల్ల సప్లై చెయిన్ దెబ్బతిని ద్రవ్యోల్బణం పెరిగి కరెన్సీ విలువ తగ్గుతుంది. అందుకే ఇలాంటి సమయాల్లో బంగారం, వెండిలోకి పెట్టుబడులు పెద్దమొత్తంలో వెళుతుంటాయి.

## మార్కెట్లకు యుద్ధ భయాలు..
# భారీ నష్టాలతో ముగిసిన సూచీలు

**ముంబయి: దేశీయ మార్కెట్లు సోమవారం కుప్పకూలాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, భగ్గుమన్న చమురు ధరలు సూచీలను (Stock Market) కుదిపేశాయి. ఫలితంగా నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ (Sensex) 1000 పాయింట్లకు పైగా పతనమవ్వగా.. నిఫ్టీ (Nifty) 25వేల మార్క్‌ను కోల్పోయింది.**



### ఆద్యంతం ఒడుదొడుకులే..

యుద్ధ భయాలతో సోమవారం ట్రేడింగ్ మొదలవ్వగానే సూచీలు కుదేలయ్యాయి. క్రితం సెషన్ ముగింపు (81,287.19)తో పోలిస్తే సెన్సెక్స్ దాదాపు 2700 పాయింట్లు పతనమై 78,543.73 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత సూచీ కాస్త కోలుకున్నప్పటికీ.. నష్టాల నుంచి బయటపడలేక పోయింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1048.34 పాయింట్ల నష్టంతో 80,238.85 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ కూడా 24,603 24,989 పాయింట్ల మధ్య కదలాడింది. చివరకు 312.95 పాయింట్లు కుంగి 24,865.70 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 44 పైసలు క్షీణించి 91.52గా స్థిరపడింది.

నిఫ్టీలో ఎల్ అండ్ టీ, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్ ప్యాసెంజర్ వెహికల్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు నష్టాలను చవిచూశాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, సన్ ఫార్మా, ఓఎన్జీసీ, డాక్టర్ రెడ్డీస్, హిందాల్కో షేర్లు లాభపడ్డాయి. లోహ రంగం మినహా అన్ని రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఆటో, చమురు రంగ సూచీలు 2శాతం మేర పతనమయ్యాయి.

## కెనడా ప్రధానికి ముకేశ్, నీతా అంబానీ ఆతిథ్యం





**ముంబయి: భారత్ పర్యటనకు వచ్చిన కెనడా ప్రధాని మార్క్ కార్నీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, నీతా అంబానీ తమ నివాసంలో ఆతిథ్యం ఇచ్చారు. మార్క్ కార్నీ, ఆయన సతీమణి డయానా ఫాక్స్ కార్నీ రాక సందర్భంగా కళావైభవాన్ని చాటేలా ముంబయిలోని యాంటిలియాలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కళాకారులతో ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ముకేశ్ తనయుడు అనంత్ అంబానీ కూడా పాల్గొన్నారు.**

## స్పామ్ మెసేజ్‌లు అరికట్టేందుకు
# ఎయిర్‌టెల్, గూగుల్ భాగస్వామ్యం




సంక్షిప్త సందేశాల (ఎస్ఎంఎస్)లో స్పామ్‌ను అరికట్టేందుకు ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత స్పామ్ ప్రొటెక్షన్ టూల్‌ను భారతీ ఎయిర్‌టెల్ వినియోగించనుంది. గూగుల్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా వచ్చే వెబ్ లింక్‌లను కూడా పరిశీలించేందుకు ఇది ఉపయోగ పడనుంది. వినియోగదారులు డిజిటల్ మోసాల బారిన పడకుండా చూసేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఇరు సంస్థలూ ప్రకటించాయి. ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ ఇంటెలిజెన్స్‌కు గూగుల్‌కు చెందిన రిచ్ కమ్యూనికేషన్స్ సర్వీసెస్ (ఆర్‌సీఎస్) జత కలవడం వల్ల మోసపూరిత సందేశాలను అడ్డుకోవడమే కాక, అధిక నాణ్యత గల ఫోటోలు/వీడియోలు, ఇంటరాక్టివ్ మెసేజ్‌లను వినియోగదారులు అందుకోగలరని తెలిపాయి. గత ఏడాదిన్నర వ్యవధిలో 7,100 కోట్ల మోసపూరిత కాల్స్, 290 కోట్ల మోసపూరిత సందేశాలను అడ్డుకోగలిగినట్లు ఎయిర్‌టెల్ తెలిపింది.

## భగ్గుమన్న చమురు ధరలు..
# ఒక డాలర్ పెరిగితే భారత్‌పై భారమెంతో తెలుసా..?




పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. అంతర్జాతీయ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధి (Strait of Hormuz)లో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకోవడంతో ధరలు 10 శాతం మేర పెరిగాయి. సోమవారం మార్కెట్లు ప్రారంభమైన సమయంలో ఇంటర్‌కాంటినెంటల్ ఎక్స్ఛేంజీలో బ్రెంట్ క్రూడ్ ఏప్రిల్ కాంట్రాక్ట్ ఒక బ్యారెల్‌కు 10 శాతం పెరిగి 81.87 డాలర్ల గరిష్ఠానికి చేరింది. ఫ్యూచర్స్‌లో బ్రెంట్ క్రూడ్ 13 శాతం పెరిగి 82.37 డాలర్లకు పెరిగింది. 2025 జనవరి తర్వాత ఇదే అత్యధిక స్థాయి. ఆదివారం కూడా ఇజ్రాయెల్ దాడులు చేయడంతో ఇరాన్ భారీగా క్షిపణులు ప్రయోగించింది (West Asia tensions). గల్ఫ్ తీరంలో మూడు చమురు ట్యాంకర్లను దెబ్బతీశామని ఇరాన్ అధికారులు వెల్లడించారు. దీంతో చమురు రవాణా నిలిచిపోతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఒమన్‌ఇరాన్ మధ్య ఇరుకుగా ఉండే సముద్ర మార్గమే హర్మూజ్ జల సంధి. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు ఈ మార్గంలోనే ప్రపంచం వినియోగిస్తోన్న చమురులో 20 శాతం దిగుమతి అవుతోంది. ప్రపంచ దేశాలు వినియోగించే ఎల్ఎన్‌జీ (ద్రవరూప సహజ వాయువు) లోనూ 20% ఇక్కడినుంచే సరఫరా జరుగుతోంది. ఇదిలాఉంటే.. భౌగోళిక రాజకీయ ఒడుదొడుకులు ఎదురైనప్పుడు భారత ఇంధన అవసరాలను తీర్చడానికి దేశంలోని వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు 74 రోజుల పాటు సరిపోతాయని గతంలో కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించిన సంగతి తెలిసిందే (Oil prices). ప్రపంచంలో అతిపెద్ద చమురు కొనుగోలుదారుల్లో భారత్ మూడో స్థానంలో ఉంది. రోజుకు 5.5 మిలియన్ల బ్యారెళ్ల మేర వినియోగిస్తోంది. అందులో 1.52 మిలియన్ల మేర ఈ జలసంధి నుంచే సరఫరా అవుతోంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు తగ్గించడంతో ఇప్పుడు పశ్చిమాసియా ప్రత్యామ్నాయంగా మారింది. బ్రెంట్ క్రూడ్ ధర ఒక డాలర్ పెరిగినా.. ఒక ఏడాదికి ప్రభుత్వం రూ.13వేల కోట్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. గతేడాది 160 బిలియన్ డాలర్ల మేర చమురును భారత్ దిగుమతి చేసుకుంది (India oil Imports).

## మన దగ్గర సరిపడా నిల్వలు
# ఉన్నాయా?



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో.. మన దేశానికి సరఫరా అయ్యే చమురులో దాదాపు సగం మేర అంతరాయం కలిగే ప్రమాదం ఉంది. అయితే ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం దీర్ఘకాలం కొనసాగినా, మన వద్ద తగినన్ని చమురు నిల్వలు ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు, వాణిజ్య నిల్వలు, రష్యా దిగుమతుల ద్వారా సరఫరాలో సమతుల్యత నిర్వహించొచ్చని కెప్లర్ విశ్లేషకుడు సుమిత్ రిటోలియా వెల్లడించారు. కెప్లర్ గణాంకాల ప్రకారం.. మన దేశం దగ్గర వాణిజ్య ముడిచమురు నిల్వలు దాదాపు 100 మిలియన్ బ్యారెళ్లు ఉన్నాయి. ఇందుకు అదనంగా మంగళూరు, పదూర్, విశాఖపట్నం ప్రాంతాల్లోని వ్యూహాత్మక నిల్వ కేంద్రాల్లో దాదాపు 39 మి.బ్యారెళ్లు ఉంది. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సగటున 2.5 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతి అవుతోంది. మన దేశ మొత్తం దిగుమతుల్లో ఇది 50 శాతానికి సమానం. ఈ సరఫరా నిలిచినా, మన నిల్వలు దాదాపు 60 రోజుల దిగుమతులకు సరిపోతాయి. అదనంగా చమురు మార్కెటింగ్ కంపెనీల వద్ద ఉన్న రిఫైన్డ్ ప్రోడక్ట్ నిల్వలు, ఈ సామర్థ్యాన్ని మరింత పెంచుతాయి అని కెప్లర్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ నిఖిల్ దూబే పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ ఒడుదొడుకులు ఎదురైనప్పుడు ఇంధన అవసరాలను తీర్చడానికి దేశంలోని వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు 74 రోజుల పాటు సరిపోతాయని గతంలో కేంద్ర చమురు మంత్రి హర్దీప్ సింగ్ పురి ప్రకటించారు.

## దుబాయ్‌లో క్షేమంగా ఉన్నాం
# మంచు విష్ణు



దుబాయ్‌లో తాము క్షేమంగానే ఉన్నామని నటుడు మంచు విష్ణు (Vishnu Manchu) తెలిపారు. అప్పుడప్పుడు దూరం నుంచి శబ్దాలు వినిపిస్తున్నాయని, అది మినహా అంతా ప్రశాంతంగా ఉందన్నారు. తాము క్షేమంగా ఉండాలని ప్రార్థించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. ఉద్రిక్త పరిస్థితుల్లో దుబాయ్ ప్రభుత్వం తీసుకున్న రక్షణ చర్యలను విష్ణు కొనియాడారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. గల్ఫ్ ప్రాంతంలో గగనతలాన్ని మూసి వేయడంతో అనేక విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. దుబాయ్‌లో చిక్కుకున్న వారిలో మంచు విష్ణు ఫ్యామిలీ కూడా ఉంది. దుబాయ్ గగనతలంలో ఇరాన్ క్షిపణుల దృశ్యాలను అప్పుడే ఎక్స్‌లో పోస్టు చేస్తూ విష్ణు ఆందోళన వ్యక్తం చేశారు. ఏ చిన్నారీ ఇలాంటి యుద్ధ వాతావరణంలో పెరగకూడదన్నారు. నటి సోనాల్ చౌహాన్ కూడా దుబాయ్‌లో చిక్కుకోగా.. తనను భారత్‌కు చేర్చాలంటూ ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేస్తూ పోస్టు పెట్టారు.



## సొంత ఊరిలో 'విజయ్‌రష్మిక' సందడి.. కొత్త ఇంట్లోకి గృహప్రవేశం.. ఊరందరికీ అదిరిపోయే 'దావత్'!


టాలీవుడ్ సెన్సేషనల్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలు వివాహం తర్వాత తొలిసారి విజయ్ స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మెన్ పేటకు చేరుకున్నారు. ఈ ఉదయం గ్రామానికి చేరుకున్న ఈ నూతన వధూవరులకు గ్రామస్థులు తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో డప్పు వాయిద్యాలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తన ఫామ్ లో నూతనంగా నిర్మించిన గృహంలోకి విజయ్‌రష్మిక దంపతులు గృహప్రవేశం చేశారు. అనంతరం వేద పండితుల సమక్షంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య జరిగిన ఈ వేడుకలో విజయ్ దంపతులు సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోయారు.
సినీ రంగంలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, తన మూలాలను మర్చిపోకుండా విజయ్ తన సొంత ఊరికి రావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గృహప్రవేశం అనంతరం విజయ్ గ్రామస్థులందరికీ భారీ విందు (దావత్) ఏర్పాటు చేశారు. ఊరందరినీ పిలిచి విందు ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ఫామ్ హౌస్ వద్ద విజయ్, రష్మికలతో ఫొటోలు దిగేందుకు అభిమానులు, గ్రామస్థులు పోటీ పడ్డారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. వీరి పెళ్లి రిసెప్షన్ ఈ నెల 4న హైదరాబాద్ లో జరగనుంది. ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.

## "ఆపిల్ పండు చెట్టుకు మరీ దూరంగా పడదు"
# ..పూజా హెగ్డే

ప్రముఖ సినీ తార పూజా హెగ్డే సోషల్ మీడియా వేదికగా తన తల్లిదండ్రులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక ఆసక్తికరమైన 'త్రోబ్యాక్' ఫొటోను పంచుకున్నారు. అందులో పూజా తల్లిదండ్రులు ఒకే గ్లాసులో నుంచి రెండు స్ట్రాలతో జ్యూస్ తాగుతుండగా, చిన్నారి పూజా కూడా స్టైల్ గా అలాగే తాగుతూ కనిపించారు. ఈ ఫొటోను షేర్ చేస్తూ.. "ఆపిల్ పండు చెట్టుకు మరీ దూరంగా పడదు (పిల్లలకు తల్లిదండ్రుల పోలికలే వస్తాయి)" అనే అర్థం వచ్చేలా క్యాప్షన్ ఇచ్చారు. "హ్యాపీ యానివర్సరీ మామ్ అండ్ డాడ్.. లవ్ యూ ఆల్" అంటూ రెడ్ హార్ట్ ఎమోజీని జతచేశారు. కాగా, పూజా తండ్రి మంజునాథ్ హెగ్డే క్రిమినల్ లాయర్ కాగా, తల్లి లతా హెగ్డే ఇమ్యూనాలజిస్ట్ మరియు వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. ఆమె సోదరుడు రిషబ్ ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఇక తన వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకునే పూజా.. తాను తిరిగి షూటింగ్ మోడ్‌లోకి వచ్చినట్లు తెలిపారు. వెకేషన్ ముగించుకుని తిరిగొచ్చిన ఆమె, వ్యానిటీ వ్యాన్ నుంచి మిర్రర్ సెల్ఫీని పోస్ట్ చేస్తూ "బ్యాక్ హోమ్ అండ్ బ్యాక్ టు షూట్" అని పేర్కొన్నారు. అయితే ఏ సినిమా షూటింగ్ అనేది మాత్రం వెల్లడించలేదు. సినిమాల విషయానికి వస్తే.. పూజా హెగ్డే దళపతి విజయ్ సరసన 'జన నాయగన్' చిత్రంలో నటించారు. ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం విజయ్ చివరి సినిమాగా భావిస్తున్నారు. అలాగే బాలీవుడ్ దర్శకుడు డేవిడ్ ధావన్ రూపొందిస్తున్న రొమాంటిక్ కామెడీ 'హై జవాని తో ఇష్క్ హోనా హై' చిత్రంలో వరుణ్ ధావన్ సరసన నటిస్తున్నారు. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్, మౌని రాయ్, శ్రీలీల వంటి భారీ తారాగణం నటిస్తోంది.



## సూర్య కొత్త సినిమా టైటిలిదే..
# ఫస్ట్ లుక్ చూశారా!




కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్ వచ్చేసింది. సూర్య 46వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'విశ్వనాథ్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం అధికారికంగా విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో సూర్య కళ్లద్దాలు ధరించి, ఓ చిన్నారిని ఎత్తుకుని ఎంతో ప్రేమగా కనిపిస్తున్నారు. బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో ఆయన లుక్ పరిపక్వంగా, భావోద్వేగభరితంగా ఉంది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎమోషనల్ టచ్‌తో ఉన్న ఈ పోస్టర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ లుక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఈ మూవీలో 'ప్రేమలు' చిత్రంతో పాప్యులర్ అయిన మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు.

అలాగే, ఈ ప్రాజెక్ట్‌లో రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్, భవాని స్రే వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.
కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలు కలగలిపి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 'లక్కీ భాస్కర్' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ సినిమాపై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని జులైలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# అందుకే 'భవదీయుడు భగత్‌సింగ్' మారింది: హరీశ్ శంకర్

**ఉస్తాద్ భగత్‌సింగ్' (Ustaad Bhagat Singh)గా సందడి చేసేందుకు సిద్ధమయ్యారు పవన్ కల్యాణ్ (Pawan Kalyan). ఆయన హీరోగా హరీశ్ శంకర్ (Harish Shankar) దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు.. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.**

'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌తో సినిమా చేసేందుకు 10 ఏళ్లకుపైగా గ్యాప్ ఎందుకు తీసుకున్నారు?
హరీశ్: పవన్ కల్యాణ్ 'ఖుషి', 'కొమరం పులి' సినిమాల మధ్య కూడా చాలా ఏళ్లు గ్యాప్ ఉంది. రెండింటికీ ఎస్.జె. సూర్యనే దర్శకత్వం వహించారు. అలానే నాకు కూడా ఆయనతో రెండో సినిమా తీయడానికి సమయం పట్టింది.
ముందుగా 'భవదీయుడు భగత్‌సింగ్' టైటిల్‌తో సినిమాని ప్రకటించారు. తర్వాత 'ఉస్తాద్ భగత్‌సింగ్' అయింది. పేరేనా.. కథ కూడా మారిందా?
**హరీశ్:** 'గబ్బర్‌సింగ్'లో పవన్ దాదాపు 80 శాతం ఖాకీ దుస్తుల్లోనే కనిపిస్తారు. ఈసారి దానికి భిన్నంగా ప్రయత్నించే క్రమంలో.. కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో కథ అనుకున్నాం. 'భవదీయుడు భగత్‌సింగ్' టైటిల్ పవన్‌కు బాగా నచ్చింది. మేం ప్రకటించకముందే లీక్ అయింది. భవదీయుడు అంటే ఏంటని సోషల్ మీడియాలో జెన్‌జీ వాళ్లు అడిగేవారు. దీంతో, సినిమా పేరే అర్థం కాకపోతే ఎలా? అని సందేహంలో పడ్డా. మరోవైపు, మా కాంబినేషన్ నుంచి అభిమానులు మాస్ అంశాలు ఆశించారు. అవి కాలేజ్ స్టోరీలో సెట్ కాలేదు. 'యూనివర్స్' ట్రెండ్ ఎలాగూ మొదలైంది కాబట్టి 'గబ్బర్‌సింగ్' రోల్ నుంచే మరో పవర్‌ఫుల్ పోలీసు అధికారి పాత్రతో కథ క్రియేట్ చేశాం. సినిమా ప్రారంభంలోనే ఉస్తాద్ భగత్‌సింగ్ టైటిల్ ఎందుకు పెట్టామో ప్రేక్షకుడికి అర్థమవుతుంది.

**ఎన్నికల ముందు సినిమాలోని గాజు గ్లాసు డైలాగ్ రిలీజ్ చేశారు. పవన్ చరిత్రాత్మక విజయం సాధించారు. మరి దాని గురించి ఏమైనా ప్రస్తావించారా?**

**హరీశ్**: అలాంటివేం పెట్టలేదు. గాజు గ్లాసు డైలాగ్ కూడా వ్యక్తిగతంగా రాసిందే తప్ప రాజకీయంతో సంబంధం లేదు.
సినిమాలోని డ్యాన్స్ మూమెంట్స్ గురించి చెప్పండి?
**హరీశ్:** కచ్చితంగా అభిమానులకు నచ్చేలా ఉంటాయి. ఒక పాటకు పవన్ 350 మందితో కలిసి డ్యాన్స్ చేశారు. క్లాప్స్, విజిల్స్‌తో సెట్స్‌లో సందడే సందడి. నేను మాత్రం దగ్గరకు వెళ్లి వన్స్‌మోర్ సర్ అని అడిగా. 'ఇంతమందికి నచ్చింది కదా.. వన్స్ **మోర్ ఎందుకు?**' అని పవన్ అన్నారు. మీ జుట్టు ఎగరలేదు, మీరు డ్యాన్స్ వేస్తున్నప్పుడు జుట్టు బౌన్స్ అవ్వాలి అని చెప్పాను. 'డ్యాన్స్ కావాలి.. జుట్టు ఎగరాలి.. మామూలు డిమాండ్స్ కావు' అంటూనే మళ్లీ చేశారు. ఇందులో మొత్తం 4 పాటలు ఉన్నాయి. త్వరలోనే మరో పాటను విడుదల చేస్తాం.




**హరీశ్ శంకర్‌కు కోపం ఎక్కువ అని టాక్ ఉంది. అది పెరిగిందా, తగ్గిందా?**

**హరీశ్**: "జయాపజయాలు ఇంటికి వచ్చే బంధువుల లాంటివి. వస్తుంటాయి.. పోతుంటాయి. యాటిట్యూడ్ అనేది ఇంటి పేరులాంటిది" అని 'మిస్టర్ బచ్చన్' సినిమాలో డైలాగ్ ఉంది. నాకు యాటిట్యూడ్ ఉంది కాబట్టే 'గబ్బర్‌సింగ్' వచ్చింది.
**'ఉస్తాద్ భగత్‌సింగ్'.. 'తేరి' మూవీ రీమేకా?**
**హరీశ్:** నాకు నచ్చిన సినిమాని రీమేక్ చేయాల్సి వస్తే.. దాని గురించి ముందుగానే చెబుతా. 'గబ్బర్‌సింగ్' రీమేక్ కాబట్టే.. టైటిల్ కార్డులో 'మాటలు, మార్పులు, దర్శకత్వం' అని పెట్టా. రీమేక్ సినిమాకి మార్పులు అని పెట్టడం అదే తొలిసారి. 'ఉస్తాద్ భగత్‌సింగ్' రీమేక్ కాదు.

## మహేశ్ బాబు 'వారణాసి'కి సంబంధించిన కీలక విషయాన్ని
# లీక్ చేసిన ప్రియాంక చోప్రా

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది బ్లఫ్' ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఇందులో ప్రియాంక నటనపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ సినిమాపై దర్శక దిగ్గజం రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రశంసల వర్షం కురిపించారు. రాజమౌళి తన ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ... ప్రియాంక ఒకే సమయంలో సున్నితత్వాన్ని, తీవ్రమైన శక్తిని ప్రదర్శించగల అరుదైన నటి అని, 'ది బ్లఫ్'లో ఆమె చేసిన యాక్షన్ స్టంట్స్ అద్భుతమని కొనియాడారు. అటు మహేశ్ బాబు సైతం ఈ చిత్రాన్ని అద్భుతమైన యాక్షన్ ఎమోషన్స్ ఉన్న చిత్రంగా అభివర్ణిస్తూ, ప్రియాంక నటన సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లిందని అభినందించారు. అయితే, ఈ ట్వీట్‌కు ప్రియాంక చోప్రా ఇచ్చిన రిప్లై అసలైన సంచలనానికి తెరలేపింది. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక అడ్వెంచర్ మూవీ 'వారణాసి'లో ప్రియాంక 'మందాకిని' అనే కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మహేశ్ అభినందనలకు కృతజ్ఞతలు చెబుతూ... "థాంక్యూ మై ఫ్రెండ్.. త్వరలోనే అంటార్కిటికాలో కలుద్దాం" అంటూ ఆమె బదులిచ్చింది. ఈ కామెంట్‌తో 'వారణాసి' తదుపరి షెడ్యూల్ మంచు ఖండమైన అంటార్కిటికాలో జరగబోతోందని ఆమె అధికారికంగా ధృవీకరించినట్లయింది. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకోనున్న తొలి భారతీయ చిత్రంగా 'వారణాసి' చరిత్ర సృష్టించబోతోంది. అత్యంత కఠినమైన వాతావరణంలో జక్కన్న ప్లాన్ చేస్తున్న ఈ యాక్షన్ అడ్వెంచర్ కోసం ఫ్యాన్స్ ఇప్పుడే లెక్కలు వేసుకుంటున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# దుబాయ్‌లో
## అజిత్, మాధవన్.. క్షేమంగానే ఉన్నారన్న సిబ్బంది



ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వేళ.. పలు దేశాల్లో దాడులు జరుగుతోన్న విషయం తెలిసిందే. కువైట్, ఖతార్, యూఏఈలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు (Iranian missile strikes) చేస్తోంది. ఈ సమయంలో అక్కడే ఉన్న అజిత్, మాధవన్‌ల గురించి వారి అభిమానులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా అజిత్ టీమ్ ఈ వార్తలపై స్పందించింది. ఆయన క్షేమంగా ఉన్నారని తెలిపింది. మోటార్‌స్పోర్ట్స్ ఈవెంట్స్ కోసం ఈ మధ్యకాలంలో అజిత్ ఎక్కువ సమయం దుబాయ్‌లోనే ఉంటున్నారు. ఇటీవల ఆయన తిరిగి చెన్నై రావాల్సిఉండగా దుబాయ్ గగనతలంపై ఆంక్షలు విధించడంతో ఆయన అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. అజిత్ క్షేమంగా ఉన్నారని.. ఆయన ప్రణాళికల్లో మార్పులు చేసుకున్నారని మేనేజర్ చెప్పారు. అభిమానులు భయపడొద్దని అన్నారు. ఇక మాధవన్ కూడా తాను క్షేమంగానే ఉన్నానని తెలిపారు. ప్రస్తుతం తాను దుబాయ్‌లో లేనని కుటుంబంతో సహా అమెరికాలో ఉన్నట్లు మీడియాకు వెల్లడించారు.

మరోవైపు దుబాయ్ గగనతలంలో ఇరాన్ క్షిపణుల దాడి దృశ్యాలను నటుడు మంచు విష్ణు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అవి తాముంటున్న ఇంటిని కదిలించాయని చెప్పారు. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో పేలుడు తమను ఎంతో భయాందోళనకు గురి చేసిందని భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు అన్నారు.

## లక్ష్మణ్ ముందుచూపు..

### కుర్రాళ్ల కోసం ఆ ముగ్గురితో 'స్పెషలైజ్డ్' క్యాంపులు



యువ క్రికెటర్ల కోసం బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే ఐపీఎల్‌కు ముందే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వేదికగా స్పెషలైజ్డ్ క్యాంప్‌లను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. సీఓఈ చీఫ్ లక్ష్మణ్ ఇప్పటికే భారత మాజీ క్రికెటర్లు జహీర్ ఖాన్, హర్భజన్ సింగ్, అనిల్ కుంబ్లేతో సంప్రదింపులు జరిపినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అత్యుత్తమ ప్రతిభ కలిగి, జాతీయ జట్టుకు ఆడే సామర్థ్యం కలిగిన ప్లేయర్లకు ఈ మాజీలతో శిక్షణ ఇప్పించాలని బీసీసీఐ భావిస్తోంది. దేశవాళీ, ఇండియా A, సీనియర్ జట్టులోని పలువురికి అవకాశం కల్పించనుంది. ఇప్పటికే జహీర్ ఖాన్ బెంగళూరులో ఉన్నట్లు సమాచారం.

''వీవీఎస్ లక్ష్మణ్ ఇప్పటికే తన సహచరులు, మాజీ క్రికెటర్లు జహీర్, హర్భజన్, కుంబ్లేతో చర్చలు జరిపాడు. హర్భజన్ నాలుగు లేదా ఐదు రోజుల 'ఆఫ్ స్పిన్నర్ల' క్యాంప్‌ను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నాడు. జాతీయ జట్టుకు ఆడాలనుకొనే క్రికెటర్లకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నాడు. టెస్టుల్లో భారత్ తరపున వందకుపైగా మ్యాచులు ఆడిన అనుభవం కలిగిన మాజీ క్రికెటర్లతో ఇలాంటి క్యాంపులను నిర్వహించడం శుభపరిణామం. రాబోయే తరాల క్రికెటర్లను మరింత రాటుదేల్చేందుకు అవకాశం ఉంటుంది'' అని బీసీసీఐ పేర్కొంది.

**సీఓఈలో పేస్ బౌలింగ్ కోచ్ పదవి కోసం..**

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో పేస్ బౌలింగ్ కోచ్ పదవి కోసం భారత మాజీ పేసర్లు వీఆర్‌వీ సింగ్, శ్రీనాథ్ అరవింద్ దరఖాస్తు చేశారు. వీరిద్దరికి ఇప్పటికే సీఓఈలో పనిచేసిన అనుభవం ఉంది. బీసీసీఐ నిర్దేశించిన పలు కోర్సులను పూర్తి చేశారు. ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ ట్రాయ్ కూలీ నిష్క్రమణతో పేస్ బౌలింగ్ హెడ్ పదవి కూడా ఖాళీ అయింది. స్పిన్ విభాగానికి సునీల్ జోషి హెడ్‌గా ఉన్నారు.

## మా హోంగ్రౌండ్ 'అహ్మదాబాద్'లో మళ్లీ ఆడతాం: దక్షిణాఫ్రికా హెడ్ కోచ్ షుక్రి

: టీ20 ప్రపంచ కప్ 2026లో ఇప్పటి వరకు అజేయంగా సెమీస్‌కు చేరుకున్న ఏకైక జట్టు దక్షిణాఫ్రికా. లీగ్, సూపర్ 8 స్టేజ్‌లో వరుస విజయాలను నమోదు చేసిన దక్షిణాఫ్రికా తొలి సెమీస్‌లో న్యూజిలాండ్‌ను ఢీకొట్టనుంది. మార్చి 4న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తలపడనుంది. సఫారీ జట్టును ఇంతకుముందు వరకు చోకర్స్ (భారీ టోర్నీల్లో విఫలమయ్యే పెద్ద జట్టు)గా పిలుస్తుండేవారు. అయితే, తమపై ఉన్న ఆ ముద్రను గత ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ గెలవడంతో చెరిపివేశామని దక్షిణాఫ్రికా ప్రధాన కోచ్ షుక్రి వెల్లడించారు. మెగా టోర్నీలో ఆడే సమయంలో ఒత్తిడి ఉండటం సహజం. అలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలి? ఆ ఒత్తిడిని ఎలా మరల్చాలి? అని ఆలోచిస్తాం. సెమీస్ మ్యాచ్ కావడంతో ఇంకాస్త ఒత్తిడి ఉన్నా.. దానిని స్వీకరించి విజయం సాధించడంపైనే దృష్టిపెడతాం. అందుకోసం గతానికి భిన్నంగా ఏమీ చేయం. ఇప్పటి వరకు ఎలా ఆడామో.. కివీస్‌తో మ్యాచ్‌లోనూ అదే దూకుడు కొనసాగిస్తాం'' అని షుక్రి తెలిపారు.



**మేం ఫేవరెట్‌గానే..**

''టీ20 ప్రపంచ కప్‌ను మేం టైటిల్ ఫేవరెట్‌గానే ప్రారంభించాం. ఇప్పటి వరకు అజేయంగా ఈ స్టేజ్‌కు వచ్చాం. కాబట్టి, మాపై పెద్దగా ఒత్తిడి ఉండదు. న్యూజిలాండ్ వంటి టాప్ టీమ్‌తో ఆడేటప్పుడు అలా భావించం. తప్పకుండా విజయం సాధించి మాకు అచ్చొచ్చిన మా సొంత మైదానం 'అహ్మదాబాద్'లో జరగబోయే ఫైనల్‌లో ఆడతామని అనుకుంటున్నా'' అని షుక్రి వెల్లడించారు. ఇప్పటి వరకు సఫారీ జట్టు ఎక్కువ మ్యాచ్‌లను అహ్మదాబాద్‌లో ఆడింది. టీమ్ఇండియాపై సూపర్ 8లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. అందుకే, 'అహ్మదాబాద్'ను హోం గ్రౌండ్‌గా దక్షిణాఫ్రికా కోచ్ షుక్రి అభివర్ణించారు.

## టీమ్ఇండియా విజయంలో అతడు కీలక పాత్ర

# పోషించాడు: సూర్యకుమార్ యాదవ్

టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజు శాంసన్ (Sanju Samson) (97*) బ్యాట్‌తో రాణించాడు. టీమ్ఇండియా (Team India) ఈ మ్యాచ్‌లో విజయం సాధించి, సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ అనంతరం టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (Suryakumar Yadav) కీలకమైన వ్యాఖ్యలు చేశాడు.

'మేం ఆడిన విధానంతో మాకు చాలా ఆనందంగా ఉంది. చావోరేవో తేల్చుకోవాల్సిన క్వార్టర్ ఫైనల్ లాంటి మ్యాచ్‌లో టీమ్ఇండియా క్రికెటర్లు అద్భుతంగా ఆడారు. ఓపికగా ఎదురుచూసిన మంచి మనుషులకు మంచే జరుగుతుంది. ఇదంతా అతడి (సంజు శాంసన్) హార్డ్ వర్క్ వల్లే సాధ్యమైంది. అతడు ఆడిన విధానం జట్టుకు విజయాన్ని అందించింది' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. అలాగే బౌలర్ల గురించి కూడా అతడు మాట్లాడాడు. 'మా బౌలర్లు ప్రణాళిక ప్రకారమే బంతులు సంధించారు. అలాగే బ్యాటర్లు కూడా బాగా ఆడారు. భాగస్వామ్యాలే కీలకమయ్యాయి. క్రికెట్‌లో ఒత్తిడి సాధారణం. కానీ అలాంటి పరిస్థితుల్లోనూ ధైర్యంగా బ్యాటర్లు పరుగులు తీయాలి. ఒత్తిడి లేకుండా ఆనందం లేదు' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు.

**సంజుశాంసన్ వరల్డ్ క్లాస్ ప్లేయర్: గౌతమ్ గంభీర్**

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో సంజుశాంసన్ విఫలమైన విషయం తెలిసిందే. దీంతో టీ20 వరల్‌డ్‌కప్ 2026లో తుది జట్టులో స్థానం కోల్పోయాడు. కేవలం ఒకటి, రెండు మ్యాచుల్లో మాత్రమే ఆడే అవకాశం వచ్చింది. అయితే వాటిలోనూ పెద్దగా స్కోర్లు చేయలేదు. కానీ వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో మాత్రం సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ (Gautam Gambhir).. అతడిని వరల్డ్ క్లాస్ ఆటగాడని అభినందించాడు. సంజు శాంసన్ ఓ వరల్డ్ క్లాస్ ప్లేయర్. అతడు ఎంత మంచి క్రికెటరో మనందరికీ తెలుసు. అందుకే మేం అతడికి మద్దతుగా నిలిచాం. జట్టుకు అవసరమైన సమయంలో తన సత్తా చాటాడు. వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో తన సామర్థ్యాన్ని చూపించాడు. మిగిలిన మరో రెండు మ్యాచుల్లోనూ అతడు ఇలాగే రాణించాలని కోరుకుంటున్నా. సంజు శాంసన్‌తో పాటు ఇషాన్ కిషన్.. వీరిద్దరూ ప్రస్తుతం టీమ్ఇండియాకు కీలకమైన ఆటగాళ్లు. భవిష్యత్తులోనూ వీరు ఇలాగే పరుగులు రాబట్టాలి' అని గంభీర్ పేర్కొన్నాడు.



# గొప్ప ఇన్నింగ్స్.. అభినందనలు

చక్కటి ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించి సెమీస్‌కు చేర్చిన టీమిండియా బ్యాటర్ సంజు సామ్సన్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. టి20 ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్లో వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆఖరివరకు క్రీజ్‌లో నిలబడి విజయాన్ని అందించిన ఈ కేరళ క్రికెటర్‌పై అభిమానులతో పాటు ప్రముఖులు పొగుడుతున్నారు. ముఖ్యంగా సొంత రాష్ట్రానికి చెందిన సినిమా స్టార్స్ ప్రశంసలతో ముంచెత్తారు. సంజు సూపర్ ఇన్నింగ్స్ కీర్తిస్తూ మాలీవుడ్ ప్రముఖులు మోహన్‌లాల్, మమ్ముట్టి, టోవినో థామస్, పృథ్వీరాజ్ సుకుమారన్, దుల్కర్ సల్మాన్, బాసిల్ జోసఫ్, నవిన్ పాలీ తదితరులు ఎక్స్‌లో పోస్టులు పెట్టారు.

**విజయకేతనం ఎగురవేయండి**

మాస్టర్ క్లాస్ ఇన్నింగ్స్‌తో సంజు సామ్సన్ సత్తా చాటాడని ప్రముఖ నటుడు మోహన్‌లాల్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. సంజు ఫామ్‌లోకి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లిన టీమిండియాకు అభినందనలు తెలిపారు. సెమీస్‌లోనూ విజయకేతనం ఎగురవేయాలని ఆయన ఆకాంక్షించారు.

**స్వచ్ఛమైన ఆధిపత్యం**

సంజు సామ్సన్ అద్భుతంగా ఆడాడని విలక్షణ నటుడు మమ్ముట్టి ప్రశంసించారు. అతిపెద్ద వేదికపై స్వచ్ఛమైన ఆధిపత్యం చెలాయించారని వ్యాఖ్యానించారు. సెమీఫైనల్‌లోకి అడుగుపెట్టిన భారత క్రికెట్ జట్టుకు అభినందనలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. మమ్ముట్టి తనయుడు దుల్కర్ సల్మాన్.. ఇన్‌స్టాగ్రామ్‌లో సంజు ఫొటో పోస్ట్ చేసి హార్ట్, క్లాప్స్ ఎమోజీలను జోడించారు.

**చిరస్మరణీయ ఇన్నింగ్స్**

'టి20 గొప్ప ఇన్నింగ్స్‌లో ఇదీ ఒకటి. కీలక క్వార్టర్ ఫైనల్లో సంజు సామ్సన్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడ'ని నటుడుచిత్రనిర్మాత దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొన్నారు. ''నిన్ను చూసి గర్వంగా ఉంది మచా. (మిత్రుడు)'' అని నటుడు కాళిదాస్ జయరామ్ మెచ్చుకున్నారు. వాట్ యాన్ ఇన్నింగ్స్ అంటూ నటుడు టొవినో థామస్ పొగిడారు. 'థ్యాంక్యూ సంజు సామ్సన్' అంటూ ప్రకాశ్‌రాజ్ అభినందించారు.

**ది రియల్ కేరళ స్టోరీ**

కాగా, కేరళ స్టోరీ 2 సినిమాకు కొంతమంది కౌంటర్ ఇచ్చారు. తమిళ దర్శకుడు సిఎస్ అముధన్ సంజు విజయాన్ని 'ది కేరళ స్టోరీ: టీమిండియాను సంజు సామ్సన్ సెమీస్ ఫైనల్‌కు చేర్చాడని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మ్యాచ్ ముగిసిన తర్వాత సంజు చేసిన ప్రార్థనలు మత సామరస్యానికి చిరునామాగా నిలిచాయని, ఇదే రియల్ కేరళ స్టోరీ అంటూ సోషల్ మీడియాలో నెటిజనులు కామెంట్లు పెడుతున్నారు. ఎవరినీ హర్ట్ చేయకుండా అన్ని మతాలను గౌరవించాడని పేర్కొంటూ ధన్యవాదాలు చెబుతున్నారు.



## టీమ్ఇండియా

# అద్భుతం చేసింది: మాజీ క్రికెటర్లు




రత జట్టు టీ20 ప్రపంచకప్ (ICC Mens T20 World Cup) 2026 సెమీస్‌కు దూసుకెళ్లింది. టాస్ గెలిచిన టీమ్ఇండియా (Team India) తొలుత బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 195 పరుగులు చేసింది. భారత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 199 రన్స్ చేసి, విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో సంజుశాంసన్ (Sanju Samson) 97* పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. టీమ్ఇండియా సాధించిన ఈ విజయంపై పలువురు మాజీలు సోషల్ మీడియా వేదికగా తమ అభినందనలు తెలిపారు.

మన క్రికెటర్లు అద్భుతం చేశారు. సెమీఫైనల్‌లోకి భారత్ ప్రవేశించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ చివరి ఓవర్లలో మనం బాగా ఆడాం. క్రీజులో పాతుకుపోయి సంజుశాంసన్ ఆడుతుంటే చూడటానికి బాగుంది. అతడు మ్యాచ్‌ను మన వైపు తిప్పాడు. అందరూ బాగా ఆడారు. సచిన్ తెందూల్కర్

ఈ విజయం టీమ్ఇండియాలో ఆత్మవిశ్వాసం నింపింది. 196 పరుగులను విజయవంతంగా ఛేదించి భారత్ సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. ముఖ్యంగా సంజుశాంసన్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనిల్ కుంబ్లే

ఒత్తిడిని చక్కగా తట్టుకొని, మ్యాచ్‌లో గెలిచి, సెమీస్‌లో స్థానం దక్కించుకున్న టీమ్ఇండియాకు శుభాకాంక్షలు. సంజుశాంసన్ భయంకర ఇన్నింగ్స్ ఆడాడు. మిషన్ కంటిన్యూస్. వీవీఎస్ లక్ష్మణ్

## సలీమా టెటె సారథ్యంలో...



స్వదేశంలో జరిగే మహిళల హాకీ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ఆదివారం హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు మిడ్‌ఫీల్డర్ సలీమా టెటె సారథ్యం వహిస్తుంది. సీనియర్ స్టార్ గోల్‌కీపర్, మాజీ కెప్టెన్ సవితా పూనియా కుటుంబ కారణాలరీత్యా ఈ టోర్నీకి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంది. ఈనెల 8 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ మెగా టోర్నీ జరుగుతుంది. ఆతిథ్య భారత్‌తోపాటు ఇంగ్లండ్, స్కాట్లాండ్, దక్షిణ కొరియా, ఇటలీ, ఉరుగ్వే, వేల్స్, ఆస్ట్రియా జట్లు ఈ టోర్నీలో పోటీపడతాయి. పూల్ 'ఎ'లో ఇంగ్లండ్, కొరియా, ఇటలీ, ఆస్ట్రియా... పూల్ 'బి'లో భారత్, స్కాట్లాండ్, ఉరుగ్వే, వేల్స్ ఉన్నాయి.

ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న భారత జట్టు తొలి లీగ్ మ్యాచ్‌ను 8న ఉరుగ్వేతో, తర్వాత 9న స్కాట్లాండ్‌తో, 11న వేల్స్‌తో తలపడుతుంది. ఈ టోర్నీ ద్వారా మూడు జట్లు ఈ ఏడాది ఆగస్టులో బెల్జియం-నెదర్లాండ్స్‌లలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి. భారత మహిళల హాకీ జట్టు: బన్సారి, బిచ్చూ దేవి (గోల్‌కీపర్లు), సుశీలా చాను, నిక్కీ ప్రధాన్, మనీషా, ఉదిత, ఇషిక చౌధరీ (డిఫెండర్లు), నేహా, సలీమా టెటె, సునెలితా టొప్పో, సాక్షి రాణా, వైష్ణవి, రుతుజా, దీపిక (మిడ్‌ఫీల్డర్లు), నవ్‌నీత్ కౌర్, ఇషిక, లాల్‌రెమ్‌సియామి, బ్యూటీ డుంగ్‌డుంగ్, బల్జీత్ కౌర్, అన్ను (ఫార్వర్డ్స్). జ్ అన్నాడు.

## మధ్యప్రాచ్యంలో యుద్ధం..

# ఆపదలో ఇంగ్లండ్ స్టార్ క్రికెటర్



ఇంగ్లండ్ స్టార్ క్రికెటర్ జానీ బెయిర్‌స్టో ఆపదలో ఉన్నాడు. అమెరికా, ఇజ్రాయిల్‌ఇరాన్ యుద్ధ నేపథ్యంలో కుటుంబంతో సహా దుబాయ్‌లో చిక్కుకుని, బిక్కుబిక్కుమంటున్నాడు. బెయిర్‌స్టో కొద్ది రోజుల కిందట కుటుంబంతో కలిసి దుబాయ్ పర్యటనకు వెళ్లాడు. వారు తిరిగి స్వదేశానికి బయల్దేరాల్సిన సమయంలో మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో దుబాయ్ విమానాశ్రయం సహా మధ్యప్రాచ్యంలోని అన్ని విమానాశ్రయాలు మూసివేయబడ్డాయి. ఎక్కడి వారు అక్కడే బిక్కుబిక్కుమంటూ కలం వెల్లదీస్తున్నారు. ముందుగా బెయిర్‌స్టో అబుదాబీలో పర్యటిస్తున్న ఇంగ్లండ్ లయన్స్ బృందంలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇందులో నిజం లేదని బెయిర్‌స్టో స్వయంగా స్పష్టం చేశాడు. తాను కుటుంబంతో సహా దుబాయ్‌లో చిక్కుకున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించాడు. ఇంగ్లండ్ లయన్స్‌ను భద్రతా సిబ్బంది అబుదాబి నుండి బయటకు తీసుకురావడానికి చేయగలిగినదంతా చేస్తుందని అనుకుంటున్నాను. నేను నా కుటుంబాన్ని సురక్షితంగా ఉంచుకొని, ఇక్కడి నుండి బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని ఎక్స్‌లో రాసుకొచ్చాడు. కాగా, మధ్యప్రాచ్యంలో యుద్ధ ప్రభావం క్రికెట్‌పై కూడా పడింది. ఈ యుద్ధం కారణంగా అబుదాబీలో జరగాల్సిన పాకిస్తాన్ షాహీన్స్‌ఇంగ్లండ్ లయన్స్ వన్డే సిరీస్ రద్దైంది. ఇక్కడే ఏర్పాటు చేసిన ఇంగ్లండ్ మహిళల జట్టు శిక్షణ కార్యక్రమం కూడా వాయిదా పడింది. త్వరలో దుబాయ్, అబుదాబీ వేదికలుగా ఆఫ్ఘనిస్తాన్‌శ్రీలంక మధ్య పరిమిత ఓవర్ల సిరీస్ జరగాల్సి ఉంది. ఈ సిరీస్ కూడా సందిగ్ధంలో పడింది. మరోవైపు సౌతాఫ్రికాలో పరిమిత ఓవర్ల సిరీస్ ముగించుకున్న పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్టు కూడా దుబాయ్ విమానాశ్రయం మూసివేయడంతో డర్బన్‌లోనే ఇరుక్కుపోయింది.